క్లుప్తంగా

యోగాతో మానసిక ప్రశాంతత



తెనాలి అర్బన్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ ఆంజనేయ యోగా కేంద్రం వ్యవస్థాపకులు కిశోర్ గురూజీ పేర్కొన్నారు. యోగా కేంద్రం ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని చుండూరు వారి సత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన చిన్న పిల్లల యోగా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో ఎక్కువ మంది మానసిక ఒత్తిడితో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అనేక శారీరక రుగ్మతల నిర్మూలనకు యోగా దోహదపడుతుందని చెప్పారు. అనంతరం దాత విక్రమ్ సహకారంతో చిన్నారులకు ఆట వస్తువులు, అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగా సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, ముంత లక్ష్మి, సూర్యనారాయణ, సుబ్బారావు, రేఖ, కోమల, రాంబాబు, మధు, సంపూర్ణ పాల్గొన్నారు.

కేజీఎఫ్ కార్యాలయం ప్రారంభం



తెనాలి: కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) తెనాలి కార్యాలయాన్ని ఆదివారం ఇక్కడి ప్రకాశం రోడ్డులోని కాంప్లెక్సులో ప్రారంభించారు. కేజీఎఫ్ వ్యవస్థాపకుడైన జెట్టి కుసుమ కుమార్ ఆదేశాలపై ఆ సంస్థ తెనాలి అధ్యక్షుడిగా జెట్టి శివరామకృష్ణప్రసాద్ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. భవిష్యత్‌లో కమ్మ సామాజికవర్గానికి అందించాల్సిన తోడ్పాటుపై ప్రణాళికను సిద్ధం చేసినట్టు తెలిపారు. జెట్టి నాగభూషణం, జెట్టి నాగేశ్వరరావు, తుమ్మల బాపయ్యచౌదరి, అంకినీడు, శంకర ప్రసాద్, ప్రవీణ్, సాయి, గిరీష్ పాల్గొన్నారు.

ధార్మిక విద్యతో ఇహ, పర లోకాల సాఫల్యం



తాడేపల్లి రూరల్: ధార్మిక విద్యతో మాత్రమే ఇహ, పర లోకాల సాఫల్యం కలుగుతుందని ఫజీలతుష్షేక్ మన్సురుద్దీన్ అహ్మద్ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలోని జామియా దారుల్ బిర్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ (మదరసా) 15వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మన్సురుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ విద్య రెండు రకాలని.. వాటిలో ఒకటి ప్రాపంచిక విద్య అయితే, మరొకటి ధార్మిక విద్య అన్నారు. ధార్మిక విద్యను ఆర్జించడం ప్రతి ముస్లిం తప్పనిసరి విధి అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనం నుంచే ప్రాపంచిక విద్యతో పాటు ధార్మిక విద్యను నేర్పించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్లా షాహిద్, ముర్తుజా, ఇల్యాస్, ఫయాజ్ ఆలం పాల్గొన్నారు.

పేద ముస్లింలకు కిట్లు పంపిణీ

లక్ష్మీపురం: ముస్లిం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ముస్లింలకు కిట్లు పంపిణీ చేశారు. స్థానిక అంజుమన్ ఇస్లామియా హైస్కూల్లో పేద ముస్లిం బాలురకు ఉచిత ఖత్నాతో పాటు పోషకాహారం, మెడికల్ కిట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సలీం, అబ్దుల్ రవూఫ్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎండీ ఆరిఫ్, ఎండీ ఇనయతుల్లా, షరీఫ్, అడ్వకేట్ సలీం పాషా, అబ్దుల్ రెహమాన్, సయ్యద్ యూసఫ్ హుసేని పాల్గొన్నారు.

పేషెంట్ రిలేషన్‌షిప్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయూ జీకేవై కార్యక్రమం ద్వారా పేషెంట్ రిలేషన్‌షిప్ అసోసియేట్(పీఆర్‌ఏ) కోర్సులో రెండు నెలలపాటు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ పాస్, డిగ్రీ పాస్, ఫెయిలై 19 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికీ శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. శిక్షణానంతరం ప్రభుత్వ గుర్తింపుతో సర్టిఫికెట్ అందించి, వివిధ సంస్థల్లో నూరుశాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువకులు వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈనెల 8వ తేదీ నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష

- తెనాలిలో తొలిసారిగా రెండు పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ
- 445 మంది విద్యార్థుల హాజరు
- పోలీసుల పటిష్ట బందోబస్తు



కేఎస్ఎం హైస్కూల్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలి టౌన్: పటిష్ట బందోబస్తు మధ్య తెనాలిలో నీట్ యూజీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తెనాలిలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో 445 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య హైస్కూల్, జగ్గడిగుంటపాలెంలోని కేంద్రియ విద్యాలయంలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోగంటి శివయ్య హైస్కూల్‌లో 225 మంది విద్యార్థులకు గానూ 212 మంది హాజరయ్యారు. కేంద్రియ విద్యాలయంలో 240 మందికి గానూ 233 మంది పరీక్ష రాశారు. రెండు చోట్ల 15 మంది గైర్హాజరయ్యారు.

ఉదయం 11 గంటల నుంచి అనుమతి

ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల మధ్యలో విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అధికారులు అనుమతించారు. ఆధార్, హాల్ టికెట్, బయోమెట్రిక్‌ను సరి చూశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. కోగంటి శివయ్య స్కూల్ వద్ద ఎంఈవో లక్ష్మీనారాయణ, కేంద్రియ విద్యాలయం వద్ద తహసీల్దార్ గోపాలకృష్ణ పర్యవేక్షణ అధికారులుగా వ్యవహరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. గతంలో నీట్ పరీక్ష రాయలంటే విద్యార్థులు గుంటూరు, విజయవాడ నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ఉన్నతాధికారుల చొరవతో తెనాలిలో మొట్టమొదటిగా కేంద్రాలు ఏర్పాటు చేశారు.



కేంద్రియ విద్యాలయంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

అన్నమయ్య పాటల పోటీలకు స్పందన



పాటల పోటీలో పాల్గొన్న చిన్నారులు

తెనాలి: శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతి సందర్భంగా, శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వెనుక ఉన్న గీతా మందిరంలో అన్నమయ్య పాటల పోటీలను నిర్వహించారు. జూనియర్ విభాగంలో 60 మంది, సీనియర్ విభాగం నుంచి 40 మంది పాల్గొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంగీత విభాగం అధిపతి చింతలపాటి మంజుల న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పిల్లల్లో భక్తి భావం పెరగడానికి, అన్నమయ్య సంకీర్తన ప్రచార నిమిత్తమే ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు చెప్పారు. విజేతలను తిరుమల లేదా ద్వారకా తిరుమల తీసుకుని వెళ్లి స్వామి దర్శనం చేయించి, అక్కడ సంకీర్తన చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొండపి వసుంధర, ఉప్పలూరు శారద, లక్కరాజు కనకదుర్గ, వీరంశెట్టి లక్ష్మీ రజిని, కారంపూడి రమాదేవి, తల్లం సావిత్రి, అందే బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

మంగళగిరి టౌన్: వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లను కేటాయించాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.దయాకర్ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని వృత్తిదారుల సంఘం కార్యాలయంలో ఆదివారం విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ కూటమి నాయకులు వడ్డెరలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని విమర్శించారు. గుట్టలు, క్వారీలపై పూర్తి హక్కు వడ్డెర వృత్తిదారులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్డెరలు ఆర్థికంగా ఎదగడానికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. గుంటూరు జిల్లాలో వడ్డెరలు వివిధ ప్రమాదాలకు గురై మృతి చెందారని.. వారి కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించడానికి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పనిచేసే సమయంలో ఎవరైనా మృతిచెందితే వారికి నష్ట పరిహారం కింద రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎనిమిది మంది వడ్డెర వృత్తిదారులతో జిల్లా సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జి.శంకర్, కార్యదర్శిగా శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా తిరుమలేష్, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా సుబ్బరాయుడు, మరో ముగ్గురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వృత్తిదారుల సంఘం కన్వీనర్ ఈమని అప్పారావు , సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన చిన్నారుల ఈత శిక్షణ శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న గోకరాజు గంగరాజు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి, అమరావతి కరకట్ట వెంట ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిన్నారుల ఈత శిక్షణ శిబిరం ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసోసియేషన్ లైఫ్ చైర్మన్, పార్లమెంట్ మాజీ సభ్యులు గోకరాజు గంగరాజు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 17 ఏళ్లుగా పిల్లలకు ఏటా ఈతలో శిక్షణ ఇస్తున్నారని అన్నారు. సుమారు 200 మంది పిల్లలకు ఈతలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఈతతో పాటు బీచ్‌వాలీబాల్, షటిల్, బాడ్మింటన్, వాకింగ్, సైక్లింగ్ తదితర ఎక్సర్‌సైజ్‌ల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆక్వా డెవిల్స్‌లో ఈత నేర్చుకున్న చిన్నారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని గుర్తుచేశారు. అసోసియేషన్ అధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ మాట్లాడుతూ సుమారు 5 వేల మంది పిల్లలకు ఈత నేర్పించామని, రోజూ శిక్షణ అనంతరం బూస్ట్ పాలు, గుడ్లు, బిస్కెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వై.వి.రమేష్‌కుమార్, కోశాధికారి కె.వి.రామయ్య, కన్వీనర్ చెల్లారి జోజిబాబు, ఉపాధ్యక్షులు గోపాళం సాంబశివరావు, సహాయ కార్యదర్శులు అమ్మిరెడ్డి రామిరెడ్డి, గుండు జనార్దనరావు, కె.ఎస్. రామచంద్రరావు, ఎం.నరసరాజు, వెంకటరెడ్డి, రాము, సాంబయ్య, కమిటీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు

- ఆదివారం స్టేషన్‌కు తప్పకుండా రావాల్సిందే !
- రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చిన వెస్ట్ డీఎస్పీ అరవింద్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ కె.అరవింద్

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో రౌడీషీటర్లు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ హెచ్చరించారు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. తొలుత రౌడీషీటర్ల రోజు వారి పనుల గురించి, ఒక్కొక్కరిపై ఎలాంటి కేసులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి ఆదివారం స్టేషన్‌కు వచ్చి సంతకం పెడుతున్నారో లేదో రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీట్ ఉన్న ప్రతి ఒక్కరూ ఆదివారం సంతకం చేసేందుకు తప్పకుండా రావాలని, రాని వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. వివాదాల్లో సెటిల్‌మెంట్లు అంటూ వ్యవహరిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు తెలియకుండా ఊరు దాటి వెళ్లడానికి వీల్లేదని హెచ్చరించారు. స్టేషన్‌కు పిలిచిన గంటల వ్యవధిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. ముఖ్యంగా రౌడీషీటర్లు నివాసం ఉండే ప్రాంతాల్లో బహిరంగ మద్యపానం, గంజాయి తదితర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఉంటే తప్పకుండా పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ఆరోగ్యరాజు, ఎస్ఐ రోజాలత, స్టేషన్ రైటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీహెచ్ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడిగా గురవయ్య

నెహ్రూనగర్: భారతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా దాసరిపల్లె గురవయ్య ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు నగరంలో జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. బీహెచ్ఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్‌గా ఎస్.రమేష్, వైస్ ప్రెసిడెంట్‌గా తిరుపతిరావు, సెక్రటరీగా రత్నశేఖర్ ఎన్నికయ్యారు.

వైభవంగా భగీరథ జయంతి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్ సమీపంలోని శివాలయంలో భగీరథ జయంతిని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సగర నాయకులు భగీరథుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గంగను ఆకాశ శిఖరాల నుంచి తీసుకు వచ్చేందుకు భగీరథుడు చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. లక్ష్య సాధనలో ఆయన తీరు అందరికీ ఆదర్శమని తెలిపారు. అనంతరం ఉండవల్లి సెంటర్‌లో మజ్జిగ పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో సగర నాయకులు కంభం సాయిచంద్, కటారి తిరుపతిరావు, నాగరాజు, ధూపాటి వాసు, నక్క వెంకట సుబ్బారావు, గార్లపాటి దుర్గారావు, గండికోట సోమరాజు, కటారి హరిబాబు, మునలయ్య, వెంకట కృష్ణ, గోపి, సుధీర్, నరసింహ, అరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చరవాణి వెలుగులో చదువులు!



మంగళగిరి: ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పట్టు వదలని విక్రమార్కుల్లా సమయాన్ని వినియోగించుకుంటున్నారు. తక్కువ సమయం ఉండడంతో ప్రవేశ పరీక్షలు రాసేవారు పట్టుదలతో చదువుతున్నారు. పట్టణంలోని శివాలయం పక్కన గల గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న అభ్యర్థులు ఆదివారం ఇలా చరవాణి వెలుతురులో చదువుతూ కనిపించారు. వాతావరణ మార్పుల వల్ల ఈదురు గాలులు, భారీ వర్షం నేపథ్యంలో ఉదయమే కరెంట్ కోత ఎదురయ్యింది. చేసేది లేక పలువురు నిరుద్యోగులు గ్రంథాలయంలో తమ చరవాణి వెలుతురు ఉపయోగించి పుస్తక పఠనాన్ని కొనసాగించారు.

మధుమేహంపై అవగాహన అవసరం

లక్ష్మీపురం: షుగర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆరోగ్యం గురించి సోషల్ మీడియాలో వచ్చే వివిధ రకాల దుష్ప్రచారాలను నమ్మరాదని, అలా నమ్మి అనుసరిస్తే చాలా సందర్భాల్లో అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందని సూచించారు. సరైన వైద్యుని వ్యక్తిగతంగా కలిసి సమస్యలు తెలిపి, వారి సూచనలు మేరకు మందులు వాడుకోవాలని కోరారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, వాణిజ్యవేత్త బాదం బసవ గుప్త, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కె.చంద్రశేఖరరావు ప్రసంగించారు.

ముగిసిన వేద విద్యార్థుల పరీక్షలు



పండిత ప్రకర్ష కార్యక్రమంలో వేద విద్యార్థులతో అధ్యాపకులు

కొల్లూరు : వేద విద్యార్థులకు 101వ వేద పరీక్షల నిర్వహణ ఆదివారంతో ముగిసినట్లు నిర్వహణ కార్యదర్శి తాడేపల్లి వెంకట సింహాద్రిశాస్త్రి తెలిపారు. ఈ నెల 2 నుంచి కొల్లూరులోని పార్వతీ సంస్కృత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలు ముగిశాయన్నారు. వేద పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులతో పరీక్షల అనంతరం అధ్యాపకులు పండిత ప్రకర్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థుల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సోమవారం ధ్రువపత్రాల పంపిణీతోపాటు, వేద స్వస్తి, వేద పండితుల సన్మాన సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఐఏఎస్‌లు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు



ముక్తేశ్వరరావును సత్కరిస్తున్న కొత్త సుబ్రహ్మణ్యం, రామ్‌చంద్

తెనాలి: సివిల్ సర్వీస్ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ 'కళారత్న' అవార్డు గ్రహీత నందివెలుగు ముక్తేశ్వరరావు అన్నారు. కొందరు అధికారులు ప్రజల పట్ల తమ బాధ్యతను మర్చిపోతుంటారని వ్యాఖ్యానించారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మానవత, తెనాలి శాఖ ఏప్రిల్ నెల సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. సంస్థ తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి నందివెలుగు ముక్తేశ్వరరావు 'అడ్మినిస్ట్రేటర్–సోషల్ రెస్పాన్సిబిలిటీ' అనే అంశంపై మాట్లాడారు. పబ్లిక్ రెస్పాన్సిబిలిటీ అనేది అధికారులకు పెద్ద బాధ్యతగా చెప్పారు. దాన్ని తీసుకున్న వాళ్లు తగిన సామర్థ్యంతో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. సామర్థ్యం అనేది బాధ్యతకు విశ్వసనీయమైన ప్రమాణంగా చెప్పారు. సామర్థ్యం కలిగిన వాళ్లకే విజన్ ఉంటుందన్నారు. గొప్ప విషయాలను సాధించడం విజన్ కాదనీ, ఉన్న వనరులతోనే తగిన ప్రణాళికతో కోరుకున్నదానిని సాకారం చేసుకోవడం విజన్‌గా చెప్పారు. బాధ్యతను తెలుసుకోవటమంటే దాన్ని నెరవేర్చేందుకు తగిన ప్రణాళికను రచించడం కూడా తెలిసుండాలని సూచించారు. ఏదేమైనా అధికారులు ప్రజల అవసరాలు, ఆసక్తులను కాపాడాల్సి ఉందని స్పష్టం చేశారు. స్వాతంత్య్రం సిద్ధించినపుడు ఐఏఎస్ వ్యవస్థ ఉండాలా? వద్దా? అనే చర్చ నుంచి ఆరంభించి, సివిల్ సర్వీస్ బాధ్యతలు, అందులోని తన అనుభవాలను ముక్తేశ్వరరావు విశదీకరించారు. మానవత రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గొప్పవారి అనుభవాలు ఇతరులకు స్ఫూర్తినిస్తాయని చెప్పారు. డాక్టర్ రామ్‌చంద్ మాట్లాడుతూ విదేశాల్లో గొప్ప విజయాలను సాధించినవారి జీవిత చరిత్రలు పుస్తకాలుగా వస్తాయని, ఇక్కడ ముక్తేశ్వరరావు జీవిత విశేషాలను ఇతరులు పుస్తకంగా తేవడం గొప్ప అంశమని తెలిపారు. సభలో విజ్ఞాన వేదిక ఆర్థిక సహకారంతో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు రచించిన 'సూక్తినిధి' పుస్తకాన్ని ముఖ్య అతిథి ముక్తేశ్వరరావు ఆవిష్కరించారు. తొలుత పాలడుగు ఆనందయ్య ముక్తేశ్వరరావును పరిచయం చేశారు. కార్యక్రమంలో మానవత ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, ఎస్‌వీ శాస్త్రి పాల్గొన్నారు.

దర్శకుడు దాసరి గొప్ప దార్శనికుడు

సినీదర్శకుడు దిలీప్ రాజా



దాసరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దిలీప్ రాజా

తెనాలి అర్బన్: సినీ దర్శకుడు దాసరి నారాయణరావు గొప్ప దార్శనికుడని మా ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్ రాజా పేర్కొన్నారు. ఆలపాటి నగర్‌లోని మా ఏపీ కార్యాలయంలో దాసరి నారాయణరావు జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దిలీప్ రాజా మాట్లాడుతూ దాసరి నిర్మించిన అనేక సినిమాలు సంవత్సరం పైగా థియేటర్లలో ప్రదర్శనకు నోచుకోవడం తెలుగు ప్రజలకు గర్వకారణమని తెలిపారు. ప్రేమాభిషేకం, మేఘసందేశం సినిమాలు తెలుగు సినిమా బతికున్నంత కాలం చెక్కుచెదరని జ్ఞాపకంగా ఉంటాయని పేర్కొన్నారు. నటుడు మిలటరీ ప్రసాద్ మాట్లాడుతు పాలకొల్లు నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన ఆయన నేటితరం దర్శకులకు రోల్ మోడల్ అన్నారు. దర్శకుడు మణివరన్ మాట్లాడుతూ 150కి పైగా సినిమాలకు దర్శకత్వం చేసిన ఆయన గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించి, దర్శకత్వ శాఖను ఎవరెస్ట్ శిఖరంపై ఎక్కించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు షేక్ మస్తాన్ వలి, నటులు బసవరత్న, సురేష్, మీరావలి పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



రేపల్లె : హనుమంతుని స్ఫూర్తిగా హిందూ ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ కోరారు. చెరుకుపల్లిలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ మండల కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సత్యనారాయణ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానాలు, సమరసత సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని చెప్పారు. ఈ నెల 10వ తేదీ రెండో శనివారం గ్రామాలలోని ఆలయాలలో సత్సంగం, 23న ఏకాదశి నగర సంకీర్తనలు, 22వ తేదీ హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించాలని తెలిపారు . వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని 12న అన్ని దేవాలయాల్లో సామూహిక హారతులు జరపాలని సూచించారు. సమావేశంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పడమట వెంకటేశ్వరరావు, ఉల్లంగుంట సాంబశివరావు, తాడివాక సామ్రాజ్యం, శంకర్ దీక్షితులు, సరస్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్‌పై అసత్య ప్రచారం తగదు



మాట్లాడుతున్న షేక్.సుభాని

నగరంపాలెం: నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌పై అసత్య ప్రచారం తగదని వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ సుభాని అన్నారు. అరండల్‌పేట ఒకటో వీధిలోని ఓ హోటల్‌లో అసోసియేషన్ రాష్ట్ర సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్‌పై రాజకీయ ప్రచారం చేయవద్దని కోరారు. ఇటీవల విజయవాడ వరదల వేళల్లోనూ వేలాది మోటారు సైకిళ్లకు మరమ్మతులు చేశామని తెలిపారు. అనవసరమైన కార్పొరేషన్ ఏర్పాటుతో మెకానిక్‌లకు ఎటువంటి ఉపయోగం ఉండదని అన్నారు. కొన్నిచోట్ల మెకానిక్‌లు గుర్తింపు కార్డులను పోలీసులకు చూపించినా ట్రాఫిక్ నిబంధనలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షులు ఉల్లి సాంబశివరావు మాట్లాడుతూ వాట్సాప్ గ్రూప్‌లు, యూట్యూబ్‌ల్లో తమ అసోసియేషన్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇటువంటి నకిలీ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కోరారు. ఏపీలోని మెకానిక్‌ల సంక్షేమం, అభివృద్ధి కోసమే అసోసియేషన్ ఆవిర్భవించిందని చెప్పారు. సమావేశంలో నాయకులు నాగరాజు, శ్రీనివాసరావు, అన్వర్‌బాషా, భవాని, సయ్యద్ అబ్దుల్ హమీద్, గణేష్, సుభానీతో పాటు 26 జిల్లాల కార్యవర్గం పాల్గొంది.

నవ్వులతో ఒత్తిడి మాయం



నవ్వులు పంచుతున్న లాఫింగ్ క్లబ్ సభ్యులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ మాట్లాడుతూ ఒత్తిడి జీవితంలో నవ్వు ఎంతో హాయినిస్తుందన్నారు. ప్రతి మనిషిలోనూ హ్యూమరస్ ఉంటుందని, దానిని వెలికితీయడానికి లాఫింగ్ క్లబ్స్ ఎంతో దోహదపడతాయని చెప్పారు. చక్కని నవ్వుతో నిత్యం ఆరోగ్యంగా ఉండవచ్చని, దీనివల్ల మనసులో ఉన్న ద్వేషాన్ని తొలగించవచ్చనని వివరించారు. అనంతరం కంటి వైద్యురాలు డాక్టర్ దివ్యదీప్తి కంటిలో నీటికాసులపై అవగాహన కల్పించారు. అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించాలని తెలిపారు.